క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమర్తలూరు(వేమూరు): సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా అమర్తలూరు మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజినీరు దోనేపూడి అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం అమర్తలూరు 33-11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఇంటూరు ఫీడర్‌లో...

అమర్తలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఇంటూరు ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు దోనేపూడి అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమర్తలూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇంటూరు ఫీడర్‌లో అన్ని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఏఈ కోరారు.

పెదపులివర్రు సబ్‌స్టేషన్ పరిధిలో..

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.శాంతకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని గుత్తావారిపాలెం, అక్కివారిపాలెం, గొరిగపూడి, కన్నెగంటివారిపాలెం, ఓలేరు, తూర్పుపాలెం, పెదపాలెం, పెసర్లంక, పెదలంక, చింతమోటు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మోదుకూరు ఫీడర్ పరిధిలో..

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు, పెనుగుదురుపాడు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దోనేపూడి అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు గమనించాలని ఏఈ కోరారు.

గురుకుల పాఠశాలలో ఆర్డీఓ తనిఖీలు



బాపట్ల: విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వార్డెన్లు, ప్రిన్సిపాల్స్ కృషి చేయాలని ఆర్డీఓ గ్లోరియ పేర్కొన్నారు. పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలోకి వెళ్లి భోజనాలను పరిశీలించారు. శుభ్రత పాటించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఆర్డీఓవెంట తహసీల్దార్ సలీమ ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



పొన్నూరు: పట్టణంలోని ఓ పెయింట్ షాపులో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వీరానాయక్ కేసు వివరాలు వెల్లడించారు. గత మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఐలాండ్ సెంటర్‌లోని దుర్గా పెయింట్స్ షాప్‌లో జరిగిన దొంగతనంలో కొంత నగదు అపహరణకు గురైంది. యజమాని షేక్. సాదిక్ భాషా ఫిర్యాదు మేరకు ఎస్ఐ. శ్రీ హరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గురువారం ఉదయం గుంటూరు శారదాకాలనీకీ చెందిన ముద్దాయి మిక్కిలి సందీప్‌ని పొన్నూరు మున్సిపల్ కార్యాలయం వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న రూ. 30 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● అతనిపై గతంలో 18 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదై, తొమ్మిది సార్లు జైలుకు వెళ్లాడన్నారు. గత 10 రోజుల క్రితం ఒంగోలు రూరల్ పరిధిలో రెండు కేసుల్లో 60 వేల నగదు, ఒక స్కూటీ, పల్నాడు జిల్లా నకరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం కేసులో రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 1 లక్ష 5 వేలతో పాటు స్కూటీ స్వాధీనం చేసుకుని ముద్దాయిని రిమాండ్ కు పంపినట్లు సీఐ తెలిపారు. 36 గంటలలో చోరీ కేసును ఛేదించిన సీఐ వీరానాయక్, ఎస్ శ్రీహరిని ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ నాయకులు
- రావికంపాడులో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'



రావికంపాడులో కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు

కొల్లూరు: ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం కోల్పోయిందని మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు పేర్కొన్నారు. మండలంలోని రావికంపాడులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలకు అబద్ధపు హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు పథకాలను అమలు చేయకపోవడంతో ప్రజలకు సంక్షేమం కరవవుతుందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను ఇబ్బడి ముబ్బడిగా అమలు చేయడంతో పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆర్థికంగా ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయకపోవడం, అర్హత ఉన్నా పథకాలు అమలు వర్తించకపోవడంతో పేద వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టి సాగిస్తున్న అరాచక పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఒక్కొక్క కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించడంతోపాటు, కూటమి ప్రభుత్వ మోసాలు వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిలుగువారిపాలెంలో...

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని జిలుగువారిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ బేతాళ వరకుమార్ అధ్యక్షతన శుక్రవారం బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రెడ్‌బుక్ రాజ్యాంగమే పరమావధిగా మహిళలు, దళితులపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునే దిక్కు లేదన్నారు. కూటమి ఏడాది పాలనపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటా ప్రభుత్వ మోసం కార్యక్రమం గూర్చి తెలియచేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల పార్టీ నాయకులు కె.గోపి, జె.మధు, ఎస్.శ్రీనివాసరావు, జె.పాండు, పి.ప్రసాద్, కె.కిషోర్, ఎన్.శ్రీనివాసరావు, జి.బాబురావు, డి.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జిలుగువారిపాలెంలో పాల్గొన్న ఎంపీపీ లలిత కుమారి, గ్రామ కన్వీనర్ బేతాళ వరకుమార్ తదితరులు

ఆడబిడ్డ నిధి ఎప్పుడు వేస్తారో...

కుచ్చెళ్లపాడు(వేమూరు): కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధి ఎప్పుడు ఇస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు దాది సుబ్బారావు ప్రశ్నించారు. వేమూరు మండలం కుచ్చెళ్లపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడపకు గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు, ఎన్నికల తర్వాత అమలు చేయకపోవడం గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు తాడికొండ శ్రీనుబాబు, గాజుల వెంకటేశ్వరరావు, గాజుల సుమన్ నాయుడు, జంపని పురుషోత్తం, కనపర్తి సర్జనరావు, కనపర్తి మోషే, రంగిశెట్టి సత్యనారాయణ, తాడికొండ శ్రీనివాసరావు, రంగిశెట్టి పాములు, గాజుల వీరరాఘవయ్య, గాజుల బాబు, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకర్లమూడిలో...

కాకర్లమూడి(వేమూరు): సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందజేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు దాది సుబ్బారావు కోరారు. వేమూరు మండలం కాకర్లమూడి గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు ప్రతి నెలా రూ.1500 అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, ఎన్నికల తర్వాత ఆడబిడ్డ నిధి గురించి పట్టించు కోవడం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు సామాజికవర్గం మహిళలకు వారి అకౌంట్‌లో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం కాపు సామాజికవర్గం ప్రజల పట్ల చిన్న చూపు చూస్తోందన్నారు. కాపు సామాజికవర్గ ప్రజలకు న్యాయం జరగాలంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోని రావాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లిముంత గంగాజలం, ఉప సర్పంచ్ ఉప సర్పంచ్ చందు శ్రీనివాసరరావు, బొల్లిముంత శ్రీనివాసరరావు, బొల్లిముంత వెంకటేశ్వరరావు, బొల్లిముంత లక్ష్మణరావు, చందు రమేష్, బొల్లిముంత అంకమ్మరావు, చందు అజయ్‌కుమార్, బొల్లిముంత నాగరాజు, బొల్లిముంత శ్రీనివాసరరావు, బొల్లిముంత శ్రీనివాసరావు, కటిక శ్రీనివాసరరావు పాల్గొన్నారు.



కాకర్లమూడి గ్రామంలో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న దాది సుబ్బారావు

నివాస గృహాల మధ్య నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి



రేపల్లె: నివాస గృహాల మధ్య నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కే.సాంబశివరావు ప్రజలకు సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం నిర్వహించిన 'ఫ్రైడే.. డ్రై డే' కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పనికిరాని వస్తువులను నిర్లక్ష్యంగా వదిలివేయడంతో వాటిలో నీటి నిల్వలు పేరుకుపోయి ఉండడం వల్ల దోమల వృద్ధికి కారణమవుతున్నాయన్నారు. డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి రోగాలకు దోమకాటే కారణమని చెప్పారు. పనికిరాని వస్తువులలో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్, మురుగు కాలవల్లో యాంటీ లార్వల్ ఆయిల్ స్ప్రే చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు సురేంద్ర, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లాక్కొని పరారీ

పట్నంబజారు: విద్యార్థిని చేతిలో సెల్‌ఫోన్ లాక్కొని పరారైన ఘటన ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విజయవాడకు చెందిన షేక్ షష్మి సత్తెనపల్లి వద్ద నలందా కళాశాలలో ఫార్మా- డీ చదువుతోంది. శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో దిగి విజయవాడ సెక్టార్‌లో బస్సు ఎక్కేందుకు ఫోన్ మాట్లాడుతుండగా, గుర్తు తెలియని యువకుడు ఆమెను బెదిరించి సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు పాతగుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నారు.

పంట పొలాలు మునక



పశ్చిమ బ్యాంక్ కెనాల్ కాలువ కట్టలపై నుంచి నీరు పొంగడంతో మునిగిన వరి పొలాలు

కొల్లూరు: కాలువలో పరిమితికి మించి నీటి పంపిణీ చేపట్టడం కారణంగా కాలువ కట్టల పైనుంచి నీరు పొంగి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. పశ్చిమ బ్యాంక్ కెనాల్ ద్వారా దిగువకు నీటి విడుదల పరిమాణాన్ని వారం రోజులుగా పెంచి సాగునీటి సరఫరా చేస్తున్నారు. కాలువ సామర్థ్యానికి మించి నీరు విడుదల చేస్తున్న కారణంగా కాలువ కట్టల పైనుంచి నీరు పొంగి కొల్లూరు స్నానాల రేవు ప్రాంతంలో కరకట్టకు అనుకొని ఉన్న వరి పొలాల్లోకి నీరు చేరింది. వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు కాలువ నీరు పంట పొలాల్లోకి చేరడంతో సాగు చేసిన వరి ఎందుకూ పనికిరాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల కిందట ఇదే తరహాలో కాలువ నీరు పొంగి పంట పొలాల్లోకి చేరడంతో పంట మునకకు గురైంది. నీటిపారుదల శాఖ అధికారులకు రైతులు సమాచారం అందించడంతో కాలువలో నీటి విడుదల పరిమాణాన్ని తగ్గించారు. ముంపుకు గురైన పంట కోలుకుంటుందనుకుంటున్న తరుణంలో గురువారం రాత్రి నుంచి తిరిగి కాలువ నిండుగా నీరు విడుదల చేయడంతో తిరిగి అవే పొలాలు మునకకు గురయ్యాయి. గుంటూరు జిల్లా కొల్లిపర ప్రాంతంలో కాలువకు గండి పడటంతో మరమ్మతులు చేపట్టేందుకు నీటిని దిగువకు భారీగా విడుదల చేయడం కారణంగా నీటి విడుదల అనివార్యమైందని నీటిపారుదల శాఖ సిబ్బంది చెపుతున్నారు. అయితే కాలువ నీరు అధికంగా విడుదల చేయడం కారణంగా పంటలు మునిగి పనికిరాకుండా పోతుండటంతో నష్టం ఎదురవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుప్రసిద్ధ సినీ రచయిత మోదుకూరి జాన్సన్

సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ



మోదుకూరి జాన్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బాపట్ల: ఆధునిక తెలుగు నాటక రంగంలో మోదుకూరి జాన్సన్ రచించిన 'నటనాలయం' నాటకం ఒక సరికొత్త ప్రభంజనాన్ని సృష్టించిందని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. మోదుకూరి జాన్సన్ జయంతి సభ బాపట్లలోని జమేదారుపేటలోని సాహితీ భారతి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సభకు సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అధ్యక్షత వహించి మాట్లాడారు. 1978 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో సినీ నటులు, దర్శకులు కోన ప్రభాకరరావు ఒకవైపు సినీ నిర్మాత ముప్పలనేని శేషగిరిరావు మరోవైపు సినీ రచయిత మోదుకూరి జాన్సన్ ఇంకో వైపు పోటీ చేసి రాజకీయాలలో సినీ రంగ ప్రాముఖ్యతను తెలియజేశారన్నారు. ప్రజాకవి డాక్టర్ ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ జాన్సన్ మరోప్రపంచం, దేశోద్ధారకుడు, మానవుడు దానవుడు, సోగ్గాడు, ఇంద్రధనస్సు వంటి చిత్రాలకు రచన చేశారన్నారు. వీరు రచించిన 'కదిలింది కరుణరథం' అనే పాట అజరామరంగా నిలిచిపోయిందన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ జాన్సన్ నటనాలయం, దేవాలయం, హృదయాలయం, వంటి నాటకాలు, డక్కాభిషకం అనే నవల, కాకి అనే కావ్యాన్ని కూడా రచించారన్నారు. ఈ సభలో కీర్తి వెంకటేష్, మాల్యాద్రి రావు, ఎంజాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, దగ్గుమల్లి శామ్యూల్, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కే కాశీదాసు తదితరులు జాన్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఓటుహక్కును హరించే ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించాలి

- సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్
- ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా



రేపల్లె అంబేద్కర్ భవనం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

రేపల్లె: పౌరుల ఓటుహక్కును హరించే స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా రేపల్లె అంబేద్కర్ భవనం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం ముందు నిలబడి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని ఓటుహక్కికి తూట్లు పొడుస్తూ మోడీ, అమిత్ షా తమ సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని రాజ్యాంగాన్ని కాపాడాలని కోరారు. సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్.మణిలాల్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి రావడానికి ఎలక్షన్ కమిషన్ ద్వారా తమకు కావలసిన చోట దొంగ ఓట్లు చేర్చుకోవడం, ఓట్లు తొలగించటం చేస్తుందన్నారు. ఇప్పటికే 15 లక్షల మంది ఓట్లు తొలగించారని, మరో 45 లక్షల మంది ఓట్లు కోల్పోయే విధంగా ఎలక్షన్ కమిషన్ ద్వారా చేస్తున్నారన్నారు. ఈ విధానాన్ని ప్రజాస్వామ్య వాదులు, రాజకీయ పార్టీలు, మేధావులు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్, డి.శ్రీనివాస్, డి.అగస్టీన్, వై.నవీన్, యు.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గుంటూరు ఆటోనగర్ శివారులోని తక్కెళ్ళపాడు సమీపంలో జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో గుంటూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన రచ్చికొండ బుల్లిబాబు కొంతకాలంగా పనిచేస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున టీ తాగేందుకు రోడ్డు దాటుతున్నాడు. అదే క్రమంలో విజయవాడ వైపు నుండి గుంటూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో బుల్లిబాబు (30) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం లారీ చక్రాల కింద నలిగి ఛిద్రంగా మారింది. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ధర్మ రక్షణ కోసం రక్షా బంధన్



రేపల్లె: ధర్మ రక్షణ కోసం రక్షా బంధన్ అని సమరత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి అన్నారు. సమరతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలోని దేవుడు కోటిరెడ్డి ఆశ్రమంలో శుక్రవారం నిర్వహించిన ధర్మ రక్షా బంధన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శ్రావణమాసం హిందువులకు శుభప్రదమైన మాసమని చెప్పారు. ప్రతి ఒక్కరూ లక్ష్మీ అమ్మవారిని పూజిస్తూ ధర్మ రక్షాబంధన్ జరుపుకుంటూ హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. మహిళలు సేవా సమితి సభ్యులకు రాఖీలు కట్టి రక్షా బంధన్ జరుపుకున్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ పొన్నపల్లి సత్యనారాయణ, జిల్లా ధర్మ ప్రచార జంజనం హేమశంకరరావు, సభ్యులు వెంకటేశ్వర్లు, పడమట వెంకటేశ్వరరావు, చింతల మురళీకృష్ణ, కొతారపు సుబ్రహ్మణ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ఏఈకి వినతి



అమర్తలూరు(వేమూరు): విద్యుత్ వినియోగదారులపై భారం పెంచే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి అగస్టీన్ డిమాండ్ చేశారు. అమర్తలూరులోని విద్యుత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు ఏర్పాటు చేస్తుందని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు రద్దు చేయక పోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వి అమృతరావు, చావలి రమేష్, పులివర్తి రాజు, కె శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రేపల్లె: మండలంలో డెంగీ జ్వరాల ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులను శుక్రవారం సాయంత్రం ఆయన పరామర్శించారు. ప్రభుత్వ వైద్యశాలలో డెంగీ జ్వరంతో బాధపడుతూ నలుగురు చికిత్స పొందుతున్నట్లు గుర్తించామన్నారు. కృష్ణాజిల్లా నుంచి ఇరువురు బాధితులు చికిత్స నిమిత్తం వచ్చారన్నారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం, రేపల్లె మండలం పేటేరు నుంచి ఒక్కొక్కరు చికిత్స పొందుతున్నారని తెలిపారు. వైద్య సిబ్బంది నిరంతరం ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించాలని చెప్పారు. జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలన్నారు. జ్వరంతో బాధపడేవారు ఆర్ఎంపీలను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోరాదని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలను సంప్రదించి సరైన సమయంలో చికిత్స పొందాలన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు



వేమవరంలో కొలువైన శ్రీ రుక్మాభాయి




విశేషాలంకారంలో వెల్లటూరు గ్రామ దేవతలు



ప్రత్యేక అలంకరణలో కన్యాకపరమేశ్వరి అమ్మవారు

భట్టిప్రోలు: శ్రావణమాసం వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని శుక్రవారం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు గ్రామదేవతల ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భట్టిప్రోలు గ్రామదేవత శ్రీ దండిపార్వతి అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి పూజలు నిర్వహించారు. సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన శ్రీ రుక్మాభాయి సమేత పాండురంగస్వామి వారు, గొరిగపూడి గ్రామ దేవత శ్రీ దేశమ్మ తల్లి, వెల్లటూరు వెల్లటూరు ముగ్గురు తల్లుల మూలపుటమ్మ వార్లు శ్రీ ముత్యాలమ్మ, శ్రీ కట్లమ్మ, శ్రీ మహాలక్ష్మి అమ్మవార్లు, అశ్వద్ధ నారాయణ మహాలక్ష్మి వృక్షం వద్ద, అద్దేపల్లి గ్రామ దేవత శ్రీ అడెమ్మ తల్లికి, కోనేటిపురంలో శ్రీ నాగేంద్ర స్వామికి, ఓలేరు గ్రామ దేవత శ్రీ ఓలేటమ్మ తల్లి, పెదపులివర్రు గ్రామదేవత శ్రీ గోగులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని దేవాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.



శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో...

చుండూరు(వేమూరు): చుండూరు మండలం చినపరిమి గ్రామంలో శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం వరలక్ష్మీ పూజలు శుక్ర వారం నిర్వహించారు. అమ్మ వారికి పంచామృతాలు అభిషేకం అనంతరం సహస్ర నామ కుంకుమార్చన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాపట్ల అర్బన్ శ్రావణ మాసం మూడో శుక్రవారం జిల్లాలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇంటింటా వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. ఇళ్లకు మంగళతోరణాలు కట్టి శ్రావణ లక్ష్మిని సాదరంగా ఆహ్వానించిన మహిళలు... అమ్మవారి విగ్రహాలను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, జాకెట్లు అందించారు. ఇక ఆలయాల్లో జరిగిన సామూహిక వ్రతాల్లో భారీగా పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పలు విద్యాసంస్థల్లోనూ విద్యార్థినులు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వరాలివ్వు తల్లీ వరలక్ష్మి అంటూ వేడుకున్నారు.

విద్యార్థుల క్విట్ ఇండియా ఉద్యమ ర్యాలీ



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం క్విట్ ఇండియా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమం గురించి నినాదాలు చేశారు.